క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర) నందు 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి. అమృతకుమార్ తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయని, ఎస్టీ 32, ఎస్సీ 04, బీసీ 02, ఓసీ 01, ఈబీసీ 01 వారికి కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా 6,7,8,9 తరగతుల్లో ఖాళీలను బట్టీ ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే నిమామకాలు చేపట్టడం జరుగుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. వివరాలకు : 9390766950, 6302246470 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

కారెంపూడి: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వై శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలని, దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఐదవ తరగతిలో ఎస్టీలకు 32 సీట్లు, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీకి ఒక్క సీటు కేటాయించడం జరిగిందని, అలాగే 6వ తరగతిలో 28 ఖాళీలు 7వ తనగతిలో 4, 8వ తనగతిలో 5, 9వ తరగతిలో 9 ఖాళీలున్నాయని ఇవన్నీ కూడా గిరిజన బాలికలకే కేటాయించడం జరిగిందని ప్రిన్సిపల్ శివరామకృష్ణ పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులకు అవకాశం

మాచర్ల: పట్టణంలోని సత్యసాయి సేవా సంస్థలు, వివిధ అభివృద్ధి సంస్థలు ఆధ్వర్యంలో పట్టణంలోని ఉచిత వృత్తి విద్యా శిక్షణ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు సత్యసాయి సేవా సమితి సేవకులు జక్కా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 19సం''రాలు నుంచి 35 నిండిన మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చునన్నారు. 10వ తరగతి పాస్ / ఫెయిల్ అయి ఉండాలన్నారు. ఆధార్, ఎస్ఎస్‌సి మార్కులిస్టు, కలర్‌ఫోటోలు 3 తో ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు శిక్షణ 45 రోజులు ఉదయం 10గం''ల నుంచి సాయంత్రం 5గం''ల వరకు ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఉచిత భోజనం, రానుపోను ఛార్జీలు శిక్షణ పొందే వారే భరించాలన్నారు. ఈ అవకాశం 40 మందికి ఉంటుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు : 8019552907, 7396598129ల ను సంప్రదించాలన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

మాచర్ల: మద్యం మత్తులో పట్టణంలో ప్రతి రోజూ భార్యతో గొడవ పడుతూ ఇదేమిటని అడిగిన వారితో వాదనకు దిగి వారిని నెట్టబోయి కింద పడి రోడ్డుకు తల వెనుకభాగం గాయం కావడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మసీదు ప్రాంతంలో నివాసముండే హనుమంతు(38) భార్యతో రోజూ ఘర్షణ పడతాడు. ఆమె పట్టణంలోని ఓ సిల్కు షోరూంలో పనిచేస్తుండగా, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మరింత మద్యం సేవించి వారి వెంట పడి గొడవ పడుతుండగా ఒకరినొకరు నెట్టుకునే సమయంలో హనుమంతు రోడ్డు పై పడగా తల వెనుకభాగం గాయం కావటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

లారీ బోల్తా

పిడుగురాళ్లరూరల్: వేగంగా వెళ్తున్న లారీ తిరగబడిన ఘటన మండలంలోని వీరాపురం గ్రామ శివారున శాంతి నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్ల వైపు నుంచి దాచేపల్లి వైపు బొబ్బాయి లోడు వేసుకుని వ్యాపారం నిమిత్తం దాచేపల్లి వైపు వేగంగా వెళ్తుండగా శాంతినగర్ వద్ద పడిపోయింది. ఇంజన్‌లో మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్ల రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తపల్లి గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం మండాది గ్రామానికి చెందిన దొరగుండ్ల బాబురావు (50) భైరవునిపాడు గ్రామ సమీపంలో ఉన్న గ్యాస్ గోడౌన్‌లో కాపలాదారుగా పనిచేస్తున్నాడు. రాత్రి కొత్తపల్లి కూడలిలో టిఫన్ చేసి నడుచుకుంటూ వెళ్తుండగా మాచర్ల వైపు నుంచి సాగర్‌కు వెళ్తున్న ఒక వాహనం ఢీకొట్టింది. దీంతో బాబురావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు

గోలి(రెంటచింతల): మండలంలోని వివిధ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించి తన వంతు కృషిచేస్తానని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోలి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరుకు ఆయన సర్పంచ్ మున్నా చంద్రం, పీఆర్ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలతో కలిసి భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చేయుతనిస్తానన్నారు. జెడ్పీ నిధుల ద్వారా గ్రామాల్లో మంచినీటి బోర్లు, అంతర్గత మురుగుకాల్వలు, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యతను ఇస్తానన్నారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిల సూచనల మేరకు జడ్పీ నిధులతో రెండు బోర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో ఉప సర్పంచ్ దేవళ్ళ ప్రసాదు, మాజీ సర్పంచ్‌లు తోడిచర్ల యహోను, గొట్టం ప్రమీల గురవారెడ్డి, గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం వాసు, పురంశెట్టి సత్యనారాయణ, త్రిపుర నాగేశ్వరరావు, పరిశ్యా నాయక్, పొట్లూరి మునయ్య, కళంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీవీఆర్

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

మాచర్ల: పట్టణంలోని శివారు ప్రాంతంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, కౌన్సిలర్ వేల్పుల గురవయ్యతో కలిసి లక్షల రూపాయలతో నిర్మించనున్న మంచినీటి బోరుకు కొబ్బరికాయ కొట్టి బోరు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులో ఉన్న వినాయకుని గుట్టలో మంచినీటి సమస్య లేకుండా శాశ్వతంగా చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం పట్టణంలో శాశ్వత పరిష్కారం కోసం నీటిని తీసుకొచ్చేందుకు చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల దానియేలు, నాగేశ్వరరావు, ఆనంద్, నట్టువ రాధాకృష్ణ తదితరులున్నారు.



బోరుకు భూమిపూజ చేసిన జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు

కొనసాగుతున్న పొలం బాట అభివృద్ధి పనులు

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో గత ఆరు రోజులుగా పొలం బాటల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గురువారం వరకు ఐదు పొలం బాటలను 13 కిలోమీటర్ల మేర బాగు చేశారు. సీతమ్మ చెరువు దారి, కొండ డొంక, అడ్డ కాల్వ దారి, బక్కరేగడి దారి, కాల్వ కట్ట దారులకిరువైపులా ఉన్న కంప చెట్లు తొలగించి ఆ మార్గాలను చదును చేయడం జరిగింది. పొలం బాటల కిరువైపులా కంప చెట్లు పెరిగి బాటలు గుంతలు పడి రైతుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన సమస్యలను తొలగిస్తున్నారు. దీంతో రైతులంతా మంచి పని చేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేయూతతో గ్రామానికి ప్రధాన రహదారి నిర్మించుకున్నామని, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్‌తో పాటు సీసీ రోడ్లు గ్రామంలో నిర్మించు కున్నామని ప్రస్తుతం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు యంత్ర పరికరాలు పంపితే పొలం బాటలను అభివృద్ధి చేసుకుంటున్నామని గ్రామానికి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఉన్నం ఆదిశేషగిరిరావు, సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీటీసీలు గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, కొంగర ఇందిరాదేవి పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.



పొలం బాటను చదును చేస్తున్న జేసీబీ

వారసత్వ సంపదకు నిలయాలు మ్యూజియంలు

విజయపురిసౌత్: వారసత్వ సంపదకు నిలయాలు మ్యూజియాలని స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను విజయపురిసౌత్‌లోని పురావస్తుశాఖ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ చౌదరి మాట్లాడుతూ మన పూర్వీకుల జీవనశైలి, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించటమే లక్ష్యంగా ప్రపంచ వ్యాప్తంగా మ్యూజియాలను నెలకొల్పినట్లు తెలిపారు. బావితరాల కోసం మ్యూజియాలను కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బుద్ధుని ధాతువు ఉన్న నాగార్జునకొండ మ్యూజియాన్ని ఇంటర్నేషనల్ మ్యూజియంగా మార్చేందుకు అధికారులు, ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి దేశ, విదేశీ పర్యాటకులకు మ్యూజియం ప్రత్యేకతల గురించి వివరించేందుకు గైడ్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ జె కమలహాసన్, కన్జర్వేటివ్ అసిస్టెంట్ యు వెంకటయ్య. ఏపీఆర్ డీసీ లెక్చరర్ డాక్టర్ మహమ్మద్‌బాష, నాగార్జునకొండ సిబ్బంది పాల్గొన్నారు.



మ్యూజియం డే వేడుకల్లో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

కారెంపూడి: ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు మండే వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. దీంతో పాటు స్వచ్ఛందంగా పలువురు దాతలు అసోషియేషన్లు చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో అత్యధిక ఉష్ణోగ్రతలతో మండుతున్న వాతావరణంలో ఇవి బాగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో చల్లని మంచినీటితో పాటు చల్లని మజ్జిగ, అల్పాహారం కూడా గత 40 రోజులుగా అందిస్తున్నారు. ఎప్పుడూ ప్రయాణీకులతో రద్దీగా ఉండే గాంధీ బొమ్మ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద వీరు ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు వగైరా శుభ సందర్భాలను పురష్కరించుకుని రోజుకు ఒకరు చొప్పున ప్రజలకు అల్పాహారం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే బస్టాండ్ సెంటర్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో, వీరుల గుడి వద్ద మండల ఫెర్టిలైజర్స్ అసోషియేషన్, గ్రామ రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్ చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే వారి దాహార్తి తీరుతోంది.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ మహిళలు

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎండలకు పేరు పొందిన రెంటచింతలలో ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేసి మంచినీటితో పాటు చల్లని మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయ మని ఎస్ఐ సయ్యద్ షమీర్ భాష అన్నారు. గురువారం స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లో మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రంలో సీపీఎం మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు, ఉల్లిందల పూర్ణయ్య, బుట్టి మరియదాసు పాల్గొన్నారు.

లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఎన్నిక



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఎన్నిక, కార్యవర్గ సభ్యులను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల అప్పారావు, ఉపాధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస రెడ్డి, సెక్రటరీ షేక్ కరిముల్లా, జాయింట్ సెక్రటరీ వెన్నా కృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా కొకెకర కోటేశ్వరలను ఎన్నుకున్నారు. మెంబర్లుగా గుజర్లపూడి ఎల్లయ్య, పోలా చలపతిరావు, గౌరవ సలహాదారుల మేకల కనిక రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కొల్లపూడి ప్రసాద్, నాదెండ్ల రంగానాయకులు, తొరటి వందనంబాబులను ఎన్నుకున్నారు.

హాస్టల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ సంక్షేమ బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఖాళీలు భర్తీ చేయడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీహెచ్ వజ తెలియజేశారు. 5వ తరగతిలో ఎస్టీ 10, 6వ తరగతిలో ఎస్టీ 15 ఖాళీలు ఉన్నట్లు తెలియజేశారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు : 9963752436, 9441921023 నంబర్లను సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విజయపురిసౌత్: విద్యుద్ఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత ఆలయానికి ఎదురుగా ఉన్న షాపులో గురువారం చోటు చేసుకుంది. మాచర్ల మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన ఆలేటి దావీదు(45) 15 సంవత్సరాలుగా సాగర్‌మాత ఆలయాన్ని నమ్ముకొని ఆర్‌సీఎం పాఠశాల యాజమాన్యం నిర్మించిన 8గదుల్లో ఒక గదిని అద్దెకు తీసుకొని చిల్లర కొట్టుతో పాటు కూల్‌డ్రింక్స్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే గదులకు అద్దె మాత్రం ఆర్‌సీఎం యాజమాన్యం వసూలు చేసుకుంటున్నారు. విద్యుత్ బిల్లులను మాత్రం ఏపీఎస్‌పీడీసీఎల్ సిబ్బంది వసూళ్ళు చేస్తున్నారు. కాగా గత ఒక సంవత్సరంగా యాజమాన్యంచే ఏర్పాటు చేసిన 8గదుల కాంప్లెక్స్‌కు విద్యుత్ ద్వారా ఎర్త్ వస్తుంది. దీంతో అద్దెలకు ఉంటున్న వ్యాపారస్తులు ఎర్త్ వస్తున్న విషయాన్ని యాజమాన్యానికి, ఏపీఎస్‌పీడీసీఎల్ సిబ్బందికి పలు మార్లు చెప్పినా కూడా నిర్లక్ష్యంతో పట్టించుకోలేదు. కాగా మంగళవారం ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు కూల్‌డ్రింక్స్ ఇవ్వమనడంతో ఫ్రిజ్ నుంచి కూల్‌డ్రింక్‌ను తీస్తుండగా విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో పక్కనే ఉన్న భార్య పక్క షాపులవాళ్ళకు చెప్పడంతో అందరూ వచ్చి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కళ్ళముందే భర్త దావీదు మృతిచెందటంతో భార్య సాలమ్మ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతునికి 3 కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



మృతిచెందిన దావీదు

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

పిడుగురాళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్ అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లోని కార్డ్స్ సొసైటీ స్కూల్‌లో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎలాంటి చేతి వృత్తులు నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభిందనీయమని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ డైరెక్టర్ కె. మేరి, ఎన్ఆర్ఐ డాక్టర్ అజితోరాజ్, అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, కౌన్సిలర్లు సైదావలి, లక్ష్మీ, అనిత, లతా, రహీం, సునీత, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, ఎండీ గఫార్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ రమేష్ కుమార్



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ కుమార్

మాచర్ల రూరల్: నిర్ణీత సమయంలో ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వహించకపోతే వారి పై చర్యలు తప్పవని తహసీల్దార్ జి రమేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సక్రమంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారి పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేసి అర్జీదారులకు తగు సమాధానాన్ని అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఇరువురు వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు నిమ్మల శ్రీనివాస్, ఫణీంద్ర, సర్వేయర్ వెంకటేశ్వరరావు, విఆర్‌ఓలు ఎ నాగేశ్వరరావు, అనిల్, ప్రశాంతి, కొండలరావు, జీరయ్య తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడు వెంకటేష్ భార్య స్వప్నకు నగదు అందజేస్తున్న కమిషనర్ రమణబాబు, వలంటీర్లు

మాచర్ల: పట్టణానికి చెందిన సొసైటీ కాలనీలో నివాసముండే వలంటీర్ కొరటా వెంకటేష్ ఏప్రిల్ నెల 1వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పురపాలక సంఘం కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో స్పందించిన పట్టణంలోని 16 సచివాలయ వలంటీర్లు, కార్యదర్శులు స్పందించి తోటి వలంటీర్ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా అందరూ స్పందించి కమిషనర్ రమణబాబుతో కలిసి రూ. 1.03 లక్షలు సమకూర్చి ఆర్థిక సాయాన్ని వెంకటేష్ భార్యకె స్వప్నకు అందజేశారు. గురువారం కిడ్స్ పాఠశాల సమీపంలోని స్వప్న కుటుంబాన్ని పరామర్శించి ఆయన ఓదార్చారు. ఆ నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘం తరుపున, వ్యక్తిగతంగా మద్దతిస్తామని రమణబాబు తెలిపారు. కార్యక్రమంలో మృతుడు కొరటా వెంకటేష్ కుటుంబ సభ్యులతో పాటు ప్రైవేటు, స్కూల్స్ అసోసియేషన్, అడ్మిన్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

20న బీసీ డేను విజయవంతం చేయండి

పిడుగురాళ్ల: ఈ నెల 20వ తేదీన జరగనున్న బీసీ డేను విజయవంతం చేయాలని పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్యలు తెలిపారు. పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు దివంగత ముఖ్యమంత్రి, గవర్నర్ కాసు బ్రహ్మానందరెడ్డి బీసీ రిజర్వేషన్ సాధించి 92 కులాలకు బీసీ రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

వెనుక బడిన తరగతుల వారి అభివృద్ధి కోసం పోరాడి బీసీ రిజర్వేషన్ సాధించిన కాసు బ్రహ్మానందరెడ్డి మే 20న వర్ధంతిని గురజాల నియోజకవర్గంలోని బీసీ నాయకులంతా హాజరై బీసీ డేను విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, సీనియర్‌నాయకులు ఇర్లా గురుస్వామి, దేవళ్ల నాగరాజు, మల్లెల వెంకటేశ్వర్లు, బీసీ, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.